సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 20 । మే । 2025



ఆలయ అభివృద్ధికి విరాళం

మలికిపురం: మలికిపురంలో అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి ఆరేటి వెంకటదాసు కుటుంబ సభ్యులు (కత్తిమండ) రూ.25,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ కమిటీకి అందించారు.




చరిత్ర చాటేలా.. చక్కదిద్దేలా..

అన్నవరం.. ఈ పేరు వింటేనే ప్రతి భక్తుని మది మురిసిపోతుంది.. ఆధ్యాత్మిక భావం వెల్లివిరుస్తుంది..

8 లో

కడలిలోకి 8,004 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 8,004 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కొత్త నిక్షేపాల కోసం పరిశోధనలు



పాశర్లపూడిలంకలో నిర్వహిస్తున్న డ్రిల్లింగ్ పనులు

మామిడికుదురు: పాశర్లపూడి ఓఎన్జీసీ స్ట్రక్చర్ పరిధిలోని పాశర్లపూడిలంకలో ఓఎన్జీసీ కొత్త నిక్షేపాల కోసం పరిశోధనలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న సైటులోనే తాజాగా ఈ ప్రక్రియ నిర్వహిస్తుంది. ఓఎన్జీసీకి చెందిన ఈ–2000–3 నంబర్ రిగ్‌తో ఇక్కడ డ్రిల్లింగ్ చేస్తున్నారు. డీవియేషన్ ప్రక్రియ (క్రాస్) డ్రిల్లింగ్ ద్వారా వైనతేయ గోదావరి నదీ అంతర్భాగంలో పనులు చేస్తుంది. సుమారు 2,910 మీటర్ల లక్ష్యం మేర డ్రిల్లింగ్ నిర్వహించాల్సి ఉండగా, సుమారు 1,900 మీటర్ల వరకూ జరిగిందని ఓఎన్జీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సైటులో రెండు బావుల నుంచి సహజ వాయువు ఉత్పత్తి అవుతోంది. మరో బావిలో ఉత్పత్తి నిలిచిపోయింది. అదే సైటులో నాల్గవ బావిలో డ్రిల్లింగ్ చేపట్టారు. కొత్త జోన్ల నుంచి నిక్షేపాలను చేజిక్కించుకోవాలన్న లక్ష్యంతో ఈ పరిశోధనలు చేస్తున్నారు. పాశర్లపూడి స్ట్రక్చర్ పరిధిలోని పలు బావుల నుంచి ఇప్పటికే ఆశాజనకంగా సహజ వాయువు లభ్యమవుతోంది.

వాడపల్లి వెంకన్నకు పంచ పాత్రల సమర్పణ



ఈఓకు బంగారు పంచపాత్రలు అందజేస్తున్న కృష్ణంరాజు కుటుంబ సభ్యులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారికి మాజీ ఎమ్మెల్యే మంతెన వెంకట సూర్యసుబ్బరాజు (ఎంవీఎస్ సుబ్బరాజు) కుటుంబ సభ్యులు ఐదు బంగారు పంచ పాత్రలు సమర్పించారు. ఎంవీఎస్ కుమారుడు, పారిశ్రామికవేత్త ఎంవీ కృష్ణంరాజు, దుర్గావతి దంపతులు, వారి కుమారుడు వెంకటసూర్య సుబ్బరాజు, శ్వేత దంపతులు, కుటుంబ సభ్యులు సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి పూజా కార్యక్రమాల నిమిత్తం ప్రత్యేకంగా 209.084 గ్రాముల బంగారంతో తయారు చేయించిన ఐదు పంచపాత్రలు, 318 గ్రాముల వెండి కంచం దేవదాయ– ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాసరావులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు వేదాశీర్వచనం గావించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ ప్రవేశ పరీక్ష

రాయవరం: జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఏపీ ఈఏపీ సెట్) ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. అమలాపురం మండలం భట్లపాలెం ఇంజినీరింగ్ కళాశాల, కాట్రేనికోన మండలం చెయ్యేరు పరిధిలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పరీక్ష జరిగింది. ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 94.52 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలి రోజు 803 మంది హాజరు కావాల్సి ఉండగా 759 మంది వచ్చారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షకు ఉదయం సెషన్‌లో 372 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 387 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగిందని ఏపీ ఈఏపీ సెట్ రాష్ట్ర కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 23 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 23 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు.

గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు చొరవ చూపాలని ఎస్పీ ఆదేశించారు. వచ్చిన 23 అర్జీల్లో కొన్ని ఆస్తి, కుటుంబ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ తరహా అర్జీదారులతో ఎస్పీ కృష్ణారావు చర్చించి పరిష్కారానికి సూచనలు చేశారు.

ప్రాధాన్యానికి చెల్లుచీటీ!

- సొమ్ము చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- 24 గంటల్లో ఇస్తామని ప్రభుత్వం హడావుడి
- తొలుత 24 నుంచి 36 గంటల్లో చెల్లింపులు
- ఇప్పుడు రోజుల పాటు లేటు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



కె.గంగవరం మండలంలో మిల్లర్లు కొన్న ధాన్యం తరలింపు



కోనసీమలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న ధాన్యం తరలింపునకు ఏర్పాట్లు

సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వం చెప్పే మాట, చేసే పని వేరవుతోంది.. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము వేస్తామని గొప్పలకు పోయింది. రైతుల చెవుల్లో హోరెత్తించేలా ప్రచారం చేసింది. నిజమే అన్నట్టుగా రబీ ధాన్యం కొనుగోలు చేసిన తొలి రోజుల్లో సొమ్ము జమ చేసింది. ఎప్పుడైతే ధాన్యం కొనుగోలు పెరిగిందో రైతులకు ఇవ్వాల్సిన సొమ్ము 24 గంటల్లో దేవుడెరుగు, రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతూ వస్తోంది.

జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు విషయంలోనే కాదు.. కొన్న ధాన్యానికి ఇవ్వాల్సిన సొమ్ము విషయంలోనూ కూటమి ప్రభుత్వం రైతుల వద్ద మాట తప్పింది. ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు సరికదా.. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేస్తామనే మాటనూ పక్కనబెట్టింది. జిల్లాలో గత ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు మొదలు కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 334 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ కేవలం 2.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలో 24,288 మంది రైతులకు రూ.503 కోట్ల వరకూ నగదు చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం కేవలం రూ.270 కోట్లు మాత్రమే చెల్లించింది. మరో రూ.60 కోట్ల బిల్లులకు సంబంధించి బ్యాంకు క్లియరెన్స్‌కు పంపించింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి సమయంలో ఈ సొమ్ము రైతుల ఖాతాల్లో జమవుతాయని పౌరసరఫరా శాఖ జిల్లా మేనేజర్ ఎం.బాల సరస్వతి 'సాక్షి'కి తెలిపారు. మిగిలిన సొమ్మును కూడా అతి త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే రైతులకు ఇంకా రూ.173 కోట్ల ధాన్యం సొమ్మును ప్రభుత్వం చెల్లించాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ సొమ్ము ఇప్పుడప్పుడే పడే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించిన సమయంలో 24 గంటల నుంచి 36 గంటల్లోపు సొమ్ము జమచేసింది. అది చాలా తక్కువ మొత్తం ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో మాత్రమే. కొనుగోలు పరిమాణం పెరిగిన తరువాత సొమ్ము చెల్లింపులను పెండింగ్‌లో పెట్టింది. అయితే ఈ చెల్లింపులు ఈ నెల 9వ తేదీ నుంచి నిలిచిపోయిన విషయం ఇక్కడ గమనార్హం. అప్పటి నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించి అరకొరగా సొమ్ము చెల్లిస్తున్నారు.

సొమ్ములు లేవంట..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆకాశమే హద్దుగా అప్పులు చేస్తోంది. పింఛన్ల పెంపు తప్ప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేసిన దాఖలాలు లేవు. రైతులకు ఏడాదికి ఇస్తానన్న రూ.20 వేల అన్నదాత సుఖీభవ సొమ్మును తొలి ఏడాది విజయవంతంగా ఎగ్గొట్టిన విషయం తెలిసిందే. పోనీ రబీలో పండించిన ధాన్యం అయినా కొంటుందా అంటే అదీ లేదు. రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలకు ప్రభుత్వం వద్ద సొమ్ము లేదని తెలుస్తోంది. రైతులు పండించిన ప్రతి గింజా ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తే చెల్లింపుల ఆలస్యం అవుతాయనే కారణంతోనే కూటమి ప్రభుత్వం ధాన్యం లక్ష్యాన్ని కుదించిందని రైతులు ముందు నుంచీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం జిల్లాలో పండించిన పంటలో కొనుగోలు లక్ష్యాన్ని సగానికి కుదించింది. అధికారుల లెక్కల ప్రకారం 1.68 లక్షల ఎకరాల్లో రబీసాగు జరగ్గా, 5.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తోందని అంచనా వేశారు. వాస్తవంగా దిగుబడి ఇంతకన్నా అధికంగా ఉంటోందని ఆయకట్టు రైతులు చెబుతున్న విషయం తెలిసిందే. అయినా తొలుత కేవలం రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి మంజూరు చేసింది. రైతుల నుంచి విమర్శలు రావడం, వైఎస్సార్ సీపీ ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతో కొనుగోలును మరో లక్ష టన్నులకు పెంచింది. దీనిలో కూడా కొన్నది మూడింట రెండో వంతు అయ్యింది. దానిలో ఇచ్చిన సొమ్ము కొనుగోలు చేసిన ధాన్యం విలువలో సగానికి కొంత ఎక్కువే. రబీ ధాన్యం కొనుగోలు చేయడంలో కాని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి హామీ ఇచ్చిన మేరకు 24 గంటల్లో సొమ్ము చెల్లింపుల విషయంలో గాని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే విమర్శలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వం ఇలా సొమ్ము ఆలస్యం చేయడం వల్ల రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు, మిల్లర్లకు అయినకాడకు అమ్ముకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోంది. దీని వల్ల రైతు 75 కిలోల బస్తాకు రూ.150 నుంచి రూ.225 నష్టపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు.

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టండి

కలెక్టర్ మహేష్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆర్డీఓలను ఆదేశించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు, అన్న క్యాంటీన్ల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాంగం పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ పారదర్శకంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీఓలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల పాల్గొన్నారు.

యోగా శిక్షణపై సమీక్ష

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ ఉన్న రోజుల్లో మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ఐదు రోజులపాటు యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. దీనిపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, ఇతర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుంచి మహేష్‌కుమార్ పాల్గొన్నారు. నెల రోజులపాటు యోగా కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి

వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని కలెక్టర్ మహేష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతోపాటు జేసీ నిశాంతి, డీఆర్వో రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జి.మమ్మీ, ఎస్‌డీసీ కృష్ణ మూర్తిలు అర్జీదారుల నుంచి సుమారు 225 అర్జీలు స్వీకరించారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణంతో పరిష్కరించలేదో అర్థమయ్యేలా వివరించాలన్నారు.

వెంకన్న దేవస్థానం ముఖద్వారానికి శంకుస్థాపన



ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎంఆర్ చైర్మన్ వెంకటరమణ దంపతులు, ఈఓ

రావులపాలెం: రావులపాలెంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ముఖద్వారం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వాడపల్లి క్షేత్రానికి నిత్యం, ముఖ్యంగా శనివారం రాష్ట్ర నలుమూలల నుంచీ అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాల వైపు వాడపల్లి క్షేత్రానికి వెళ్లే భక్తులకు స్వాగత ద్వారంగా వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ముఖద్వారం (ఆర్చ్ గేట్)ను దాతల ఆర్థిక సాయంతో నిర్మించాలని దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ప్రతిపాదించారు. అందుకు సీఎంఆర్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ మేరకు రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం సమీపంలో నిర్మించాలని నిర్ణయించారు. సుమారు రూ.20 లక్షలతో ఈ ఆర్చ్ గేట్ నిర్మాణానికి ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.

టీడీపీలో ఇతర ప్రాంతాల వారికి టిక్కెట్లా?

అంబాజీపేట: టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీనే నమ్ముకున్న వారిని కాదని ఎన్నికల ముందు ఎమ్మెల్యే అభ్యర్థులుగా వేరే ప్రాంత వ్యక్తులకు టిక్కెట్లు ఇవ్వడం ఎంత వరకూ సమంజసమని, ఈ విషయంపై రాష్ట్ర టీడీపీ మహానాడులో చర్చ జరగాలని ఇరుసుమండకు చెందిన పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు చిన్నం బాలవిజయరావు అన్నారు. అంబాజీపేట వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ మహానాడు కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ గతేడాది జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న ఎస్సీ నాయకులను కాదని, టీడీపీలో అభ్యర్థులే లేనట్లు ఎక్కడో ఉన్న మహాసేన రాజేష్‌కు టిక్కెట్ కేటాయించడం స్థానిక నాయకులను అవమానపర్చడమేనన్నారు. గత ఏడాది వరకూ వేరే పార్టీలో ఉంటూ టీడీపీని దుమ్మెత్తి పోసిన నాయకులను కొందరు పార్టీలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

రత్నగిరి.. భక్తజనఝరి



ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధి సోమవారం భక్తజనఝరిని తలపించింది. రత్నగిరిపై, ఇతర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధువులతో పాటు ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం కిక్కిరిసిపోయింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు 2,100 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను ముత్యాల కవచాలతో అలంకరించి (ముత్తంగి సేవ) పూజించారు.

రాజోలు టీడీపీలో ఇన్‌చార్జి రగడ

- గుబ్బలకు చెక్ పెడుతూ ఎస్సీల సమావేశం
- పదవి కోసం పావులు కదుపుతున్న జగడం, గెడ్డం



రాజోలు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ విభాగం సమావేశంలో గెడ్డం సింహా తదితరులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని టీడీపీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. కూటమి నుంచి జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో తాడూబొంగరం లేకుండా ఉన్నామని టీడీపీ క్యాడర్ అసంతృప్తితో ఉండగా.. గత కొంత కాలంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పదవిపైనా ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సోమవారం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ విభాగ సమావేశాన్ని గోనిపాటి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల తరువాత ఒక నాయకత్వం లేకుండా ఉన్న టీడీపీకి ఇన్‌చార్జిని వెంటనే నియమించాలని కోరుతూ తీర్మానం చేశారు. పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడిగా ఉన్న గెడ్డం సింహాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించాలని తీర్మానించారు. అయితే ఈ పదవి కోసం ఆ పార్టీలోని అదే సామాజికవర్గానికి చెందిన మరో నాయకుడు రాజోలుకు చెందిన జగడం సత్యనారాయణ కూడా కర్చీఫ్ వేశారు. దీంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఇటీవల వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును టీడీపీలోకి తీసుకుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించుకుని జనసేన ఎమ్మెల్యేకు దీటుగా పెట్టుకుందామని టీడీపీలో ఒక వర్గం పావులు కదపగా, అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా నియోజకవర్గ టీడీపీ ఎస్సీ విభాగం అత్యవసరంగా సమావేశం కావడం వెనుక ఆ పార్టీలో ఉన్న తీవ్ర అసంతృప్తే కారణమని తెలుస్తోంది. రాజోలు నియోజకవర్గం నుంచి ధవళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఉన్న గుబ్బల శ్రీనివాస్‌ను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఖరారు చేయాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి దీటుగా ఎస్సీ నియోజకవర్గమైన రాజోలుకు బీసీ ఇన్‌చార్జి ఏంటనే విధంగా తాజాగా ఎస్సీ విభాగం సమావేశం తీర్మానం చేసింది. ఇందులో భాగంగా గెడ్డం సింహాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించాలని చేసిన తీర్మానం కాపీలను పార్టీ అధిష్టానానికి పంపుతున్నట్లు సోమవారం సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

క్రమబద్ధీకరణలో వీఆర్వోలకు అన్యాయం



ఇన్‌చార్జి తహసీల్దార్ మాధురికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోల సంఘ నాయకులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ/ వార్డు సచివాలయాల క్రమబద్ధీకరణ ప్రక్రియలో తమకు అన్యాయం జరుగుతుందని వీఆర్వోలు నిరసన తెలిపారు. దీనిని సరిచేయాలంటూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పి.మాధురికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి గోదావరి జిల్లాల గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబరు 4ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది వీఆర్వోలు ఉండగా 7,500 మందిని ప్రభుత్వం అదనపు సిబ్బందిగా గుర్తించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం కనీసం సంప్రదింపులు కూడా జరపకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు పి.సత్తిబాబు, కార్యదర్శి డి.నరేష్, ఉపాధ్యక్షురాలు పి.సాయిప్రతిమ, కోశాధికారి ఎస్.సురేష్, మాజీ మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజనతో గ్రామీణాభివృద్ధి సాధ్యమని, దీనికి జిల్లాలో 55 గ్రామాలను ఎంపిక చేశారని జేసీ టి.నిషాంతి తెలిపారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్ నుంచి ఈ పథకం అమలు, విధి విధానాలపై ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల జనాభా ఎక్కువగా ఉన్న 34 గ్రామాల కార్యాచరణ ప్రణాళికలు సమర్పించారని, మిగిలిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను త్వరితగతిన అందించాలని ఆదేశించారు. షెడ్యూల్ కులాల జనాభా 50 శాతం కంటే ఎక్కువ ఉంటే సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అన్నివర్గాల ప్రజల కనీస అవసరాలు పూర్తిగా తీర్చేలా సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. సంస్థాగత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు సామాజిక ఆర్థిక అసమానతలను తగ్గించాలన్నారు. భారత్ నిర్మాణ్, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన, సర్వశిక్షా అభియాన్, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలను ఈ గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేస్తారన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్, గృహ నిర్మాణం వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెడతారన్నారు.

కక్ష సాధింపు మానాలి



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: కక్ష సాధింపులు మానుకుని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. గైగోలుపాడులోని తన నివాసంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మద్యం విధానంపై పెట్టిన కేసులో మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు, అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసును సీఐడీ నుంచి సిట్‌కు అప్పజెప్పడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మద్యం అమ్మకాలు పెరిగినప్పుడు అవినీతి జరుగుతుందా, తగ్గినప్పుడు జరుగుతుందా గమనించాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కక్ష సాధింపులో భాగంగానే ఆయన అనుచరులను వేధిస్తున్నారన్నారని పేర్కొన్నారు. గతంలో ఐఏఎస్ అధికారులు శ్రీలక్ష్మి, బీపీ ఆచార్యలను ఇదే మాదిరిగా వేధించారని, వారు ఆ కేసుల నుంచి క్లీన్‌చిట్‌తో బయటకు వచ్చారని అన్నారు. అటవీ భూములు ఆక్రమించారంటూ పెద్దిరెడ్డి కుటుంబంపై కేసులు బనాయిస్తున్నారన్నారు. భోగాపురంలో నిర్మించిన రిసార్ట్‌లో 51 ఎకరాల అటవీ భూమి ఉందనే ఆరోపణలను నిగ్గు తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులపై, గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులపై అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని నాగమణి హితవు పలికారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

సత్యా ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రారంభం



అమలాపురంలో సత్యా ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గణేష్, సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సత్యా ఎలక్ట్రానిక్స్ సంస్థ తన 57వ షోరూమ్‌ను అమలాపురం మెయిన్ రోడ్డులోని కొత్త భవనంలో సోమవారం ప్రారంభించింది. దీనిని మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్ ప్రారంభించారు. సంస్థ డీజీఎం సురేష్ మాట్లాడుతూ తమ సంస్థకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో 300కి పైగా షోరూమ్‌లు ఉన్నాయని చెప్పారు. తమ షోరూమ్‌లో అన్ని గృహోపయోగకరణాలపై 70 శాతం వరకూ తగ్గింపు ధరలతోపాటు ప్రతి కొనుగోలుపై బహుమతులు అందిస్తున్నామన్నారు. సమ్మర్ ఆఫర్‌గా ఏసీల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపులు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాత నవ భారత్ షాపు యజమాని, బిల్డింగ్ యజమాని మోరం తాతాలు దంపతులు, సంస్థ సేల్స్ హెడ్ సింథిల్, సత్యా ఏజెన్సీ ఉద్యోగులతో పాటు పట్టణ ప్రముఖులు గంధం పల్లంరాజు, బోణం సత్య వరప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, యేడిద శ్రీను, తిక్కిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కొత్తపేట: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై జి.సురేంద్ర కథనం ప్రకారం.. మండల పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన గంధం నాగేశ్వరరావు (40) ఆదివారం రాత్రి స్థానిక దేవాలయంలో బంధువుల పెళ్లికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి కొత్తపేట వచ్చాడు. నాగేశ్వరరావు పాత బస్టాండ్ వద్ద నిలబడి ఉండగా అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపుకు వెళుతున్న ఆర్టీసీ బస్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతని బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర వివరించారు.

చరిత్ర చాటేలా.. చక్కదిద్దేలా..

- సత్యదేవుని సన్నిధిలో వైదిక కార్యక్రమాలు
- 'సాక్షి'లో వరుస కథనాలతో చర్యలు
- శృంగేరి పీఠాధిపతి సూచనలతో ముందుకు..
- అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ వెల్లడి

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: అన్నవరం.. ఈ పేరు వింటేనే ప్రతి భక్తుని మది మురిసిపోతుంది.. ఆధ్యాత్మిక భావం వెల్లి విరుస్తుంది.. అలాంటి రత్నగిరిపై లోటుపాట్లు విమర్శలకు తావిచ్చాయి.. దీనిపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్పందించారు. చక్కదిద్దే చర్యలకు ముందుకు వచ్చారు.. ఇక నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిత్యం జరిగే పూజాదికాలు, స్వామివారి కల్యాణోత్సవాలు, వేడుకల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై త్వరలో శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామివారి సూచనలు, సలహాలు తీసుకోనున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు రోహిత్ వెల్లడించారు. ఈ ఏడాది మే ఏడో తేదీ నుంచి 13వ తేదీ వరకూ జరిగిన సత్యదేవుని దివ్య కల్యాణోత్సవాల్లో గతంలో జరిగిన ఉత్సవాలకు భిన్నంగా వనదుర్గ అమ్మవారి చండీ, ప్రత్యంగిర హోమాలు నిలిపివేయడంపై 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు వచ్చిన విషయం విదితమే. అదే విధంగా 13న జరిగిన స్వామివారి శ్రీపుష్పయాగంలో అమ్మవారిని స్వామివారికి ఎడమవైపు కాకుండా కుడివైపునకు వచ్చేలా ఏర్పాటు చేయడంపై కూడా భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి. కల్యాణోత్సవాల్లో చోటు చేసుకున్న అపశ్రుతులపై కూడా 'సాక్షి' దినపత్రికలో ఆదివారం 'ప్చ్..కళ కట్టలేదు' శీర్షికన కథనం వచ్చింది. దేవస్థానంలో వైదిక కార్యక్రమాల విధి విధానాలు రూపొందించాల్సిన వైదిక కమిటీ సరైన శ్రద్ధ చూపకపోవడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠాధిపతితో చర్చించి వారి సూచనల మేరకు దేవస్థానంలో వైదిక కార్యక్రమాల రూపకల్పన, ఉత్సవాల్లో చేయాల్సిన క్రతువులు, హోమాలు నిలుపుదల చేయాలా వద్దా తదితర విషయాలపై కూడా స్పష్టత వచ్చేలా మార్గదర్శకాలు రూపొందించనున్నారు. దాని ప్రకారం భవిష్యత్తులో దేవస్థానంలో వైదిక కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

వైదిక సలహాదారుడు లేక ఇబ్బంది

దేవస్థానంలో గతంలో వైదిక కార్యక్రమాలపై సలహాలకు ప్రముఖ పండితుడిని వైదిక సలహాదారుగా నియమించి పూజలు నిర్వహించేవారు. తొలుత ప్రముఖ పండితుడు తంగిరాల బాలగంగాధరశాస్త్రి దేవస్థానం వైదిక సలహాదారుగా ఉండేవారు. ఆయన తరువాత రాజమహేంద్రవరానికి చెందిన పండితుడు మధుర కృష్ణమూర్తిశాస్త్రి 2010 వరకూ కొనసాగారు. 2014లో రాజమహేంద్రవరానికి చెందిన జాంపండు మాస్టారుగా పేరు పొందిన ప్రముఖ పండితుడు శ్రీసత్యనారాయణ మూర్తిని నియమించారు. ఆ తరువాత మరో సలహాదారుడిని నియమించలేదు. దీంతో దేవస్థానం వైదిక కమిటీ సూచనల మేరకే వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో దేవస్థానం వైదిక కమిటీ నిర్ణయాలు తీవ్ర విమర్శలకు తావిచ్చిన నేపథ్యంలో వైదిక సలహాదారు లేని లోటు కనిపిస్తోంది. దేవస్థానంతో 50 ఏళ్ల అనుబంధం కలిగిన ప్రముఖ వేద, జ్యోతిష పండితుడు, మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు, కంచి కామకోటి పీఠం, శృంగేరీ పీఠాధిపతులతో సాన్నిహిత్యం కలిగిన రాజమహేంద్రవరానికి చెందిన శ్రీవిశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రిని వైదిక సలహాదారునిగా నియమిస్తే బాగుంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



సత్యదేవుని కల్యాణోత్సవాల్లో స్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు (ఫైల్)

విధి విధానాలు రూపొందిస్తాం..



ఈ ఏడాది కల్యాణోత్సవాల్లో వనదుర్గ అమ్మవారి హోమాల నిలిపివేత, శ్రీపుష్పయాగం రోజున స్వామి, అమ్మవారి అలంకరణపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇటువంటి వివాదాలు రాకుండా చర్యలు తీసుకుంటాం. దేవస్థానంలో జరిగే వైదిక కార్యక్రమాలు, ఉత్సవాల్లో అనుసరించాల్సిన పద్ధతులు, అలంకరణలపై శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామివారిని మార్గదర్శనం చేయాలని కోరతాం. వారి సూచనలు, సలహాలు ప్రకారం నడుచుకుంటాం. వీటిని అతిక్రమించకుండా చూస్తాం.

–ఐవీ రోహిత్, చైర్మన్, అన్నవరం దేవస్థానం



ప్చ్.. కళ కట్టలే..

కల్యాణోత్సవాల్లో లోటుపాట్లపై 'సాక్షి' ప్రచురించిన ప్రత్యేక కథనం

ప్రతిభ ఉంటే.. ఉపకారం మీ వెంటే

- వెనుకబడిన విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్ షిప్స్
- దరఖాస్తులకు జూన్ 30 గడువు
- అభ్యర్థులకు జూలై 13న స్క్రీనింగ్ టెస్ట్

రాయవరం: విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనాలు అందిస్తోంది. కళాశాల విద్యలో సత్తా చాటేవారికి ఈ సాయం వరంలా మారనుంది. 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో అమలవుతోంది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద 6 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఎంపికైన విద్యార్థులు రెండేళ్ల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకూ స్కాలర్‌షిప్ అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా భవిష్యత్‌కు అవసరమైన దిశా నిర్దేశం చేస్తారు.

అర్హత ఇదీ..

సరోజిని దామోదర్ ఫౌండేషన విద్యాదాన్ ఉపకార వేతనం పొందడానికి విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉండాలి. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులు. పదో తరగతిలో కనీసం 90 శాతం మార్కులు ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు సాధించాలి.

ఎంపిక విధానం ఇలా..

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూలై 13న దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ– మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు ప్రకటించిన తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

తుది గడువు ఎప్పుడంటే..

విద్యాదాన్ ఉపకార వేతనం దరఖాస్తుకు జూన్ 30 తుది గడువు. దరఖాస్తుదారులు పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం, చదువుతున్న కళాశాల వివరాలు పొందుపర్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా సొంత ఈ –మెయిల్ కలిగి ఉండాలి. నెట్ సెంటర్ లేదా ఇతరుల ఈ– మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ– మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈ–మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని, పాస్‌వర్డ్‌ను గుర్తుంచుకోవాలి. మరిన్ని వివరాల కోసం సోమవారం నుంచి శనివారం మధ్యలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విద్యాదాన్.ఆంధ్రఎస్‌డీ ఫౌండేషన్‌ఇండియా.కామ్‌లో సంప్రదించాలి. లేదా హెల్ప్‌లైన్ 96635 17131 నంబరుకు ఫోన్ చేయవచ్చు.



పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

Vidyadhan
Transforming lives through education
A Shibulal Family Philanthropic Initiative


ఇలా దరఖాస్తు చేసుకోవాలి

పదో తరగతి మార్కుల జాబితాల ప్రకారం మీ పేరులో మొదటి పేరు, తర్వాత రెండో పేరును నమోదు చేయాలి. అనంతరం విద్యార్థి సొంత అడ్రస్‌ను ఎంటర్ చేయాలి. అనంతరం అప్లై నౌ ఆప్షన్ క్లిక్ చేసి మీ ఈ– మెయిల్‌కు మీ అకౌంట్ యాక్టివేషన్ కోసం లింక్ వస్తుంది. యాక్టివేషన్ లింక్ క్లిక్ చేయగానే విద్యాదాన్ హోమ్ పేజీలో అకౌంట్ యాక్టివేటెడ్ అనే మెసేజ్ వస్తుంది. అనంతరం ఈ– మెయిల్ ఐడీ, విద్యాదాన్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయ్యి, స్టెప్–2లోకి వెళ్తారు. లాగిన్ అయిన తర్వాత హెల్ప్‌పై క్లిక్ చేసి, సూచనలు చదివి, దాని ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయాలి. అప్లికేషన్ పూర్తి చేసిన తర్వాత ఎడిట్‌పై కిల్క్ చేస్తే అప్లికేషన్‌ను ఎడిట్ చేసుకోవచ్చు. అన్నీ అయ్యాక సబ్‌మిట్‌పై క్లిక్ చేసిన తర్వాత సబ్మిషన్ సక్సెస్‌ఫుల్ అని చూపిస్తుంది. అలాగే డాక్యుమెంట్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అప్‌లోడ్ చేసిన తర్వాతే దరఖాస్తును అంగీకరిస్తుంది. దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు ఈ– మెయిల్‌ను చెక్ చేసుకోవాలి. ఎస్‌డీఎఫ్ ప్రతి సమాచారాన్ని ఈ– మెయిల్ ద్వారా తెలియజేస్తుంది. విద్యార్థులు నేరుగా ప్లే స్టోర్‌లోని విద్యాదాన్ యాప్ ద్వారా లేదా విద్యాదాన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాదాన్.ఓఆర్‌జీలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

జంట ఆత్మహత్యపై కేసు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధి వేట్లపాలెంలో ఒక జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాకినాడ సిద్ధార్థ ఆస్పత్రి, గైడ్ ఆస్పత్రిలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఉప్పల పోసిబాబు (40), గైడ్ మెడికల్ షాపులో పని చేస్తున్న గెద్దం దివ్యనాగలక్ష్మి (35) ఈ నెల 17న రైలుకు అడ్డుగా నిలబడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వారి మధ్య ఉన్న వివాహేతర సంబంధం బయట పడుతుందనే అనుమానంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని కాకినాడ నుంచి సామర్లకోట మోటారు సైకిల్‌పై వచ్చారు. అక్కడి నుంచి వేట్లపాలెం వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాలను రైల్వే ట్రాలీ మేన్ డి.లక్ష్మణరావు గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు విచారణ ప్రారంభించారు. మృతులిద్దరికీ వివాహాలు కాగా పోసిబాబుకు ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోసిబాబు తన పెద్ద కుమారుడికి ఫోన్‌చేసి చనిపోతున్నట్లు చెప్పాడని వివరించారు. మృతుడి జేబులో ఉన్న సూసైడ్ నోట్‌లో వివరాలు లభించడంతో కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై వాసు తెలిపారు.

శ్యాంబాబు మృతి మాదిగలకు తీరని లోటు



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాకినాడ సిటీ: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన కొండేపూడి శ్యాంబాబు మాదిగ మృతి జాతికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. కాకినాడ మధురానగర్‌లో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పూర్వ అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత శ్యాంబాబు కుటుంబ సభ్యులను మందకృష్ణ పరామర్శించి ధైర్యాన్ని నింపారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమాన్ని అడ్డుకున్నది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే అన్నారు. అనేక సవాలను ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో శ్యాంబాబు కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం శ్యాంబాబు చేసిన ఉద్యమాలకు సంబంధించిన ఫొటోలను, శ్యాంబాబు నిలువెత్తు ఫొటోలను కుటుంబ సభ్యులతో కలసి కృష్ణమాదిగ తిలకించి ఆవిష్కరించారు. జాంబవ నిధికి కొండేపూడి శ్యాంబాబు కుటుంబ సభ్యులు రూ.లక్ష చెక్కును కృష్ణమాదిగకు అందజేశారు. కార్యక్రమానికి కొండేపూడి శ్యాంబాబుమాదిగ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

గుండెపోటుతో హెడ్ నర్స్ మృతి



అనంతకుమారి (ఫైల్)

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెడ్ నర్సుగా పని చేస్తున్న జీఎల్ అనంత కుమారి (59) సోమవారం గుండెపోటుతో మరణించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన అనంత కుమారి సోమవారం మధ్యాహ్నం తనకు నీరసంగా ఉందని ఇంట్లో చెప్పి తణుకులోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ గుండెపోటుతో మృతి చెందారు. గత 20 రోజుల నుంచి ఆమె సెలవులో ఉన్నారు. ఈనెల 23న విధులకు హాజరు కావాల్సి ఉంది. పి.గన్నవరం సీహెచ్‌సీలో 2023 జూన్‌లో ఆమె హెడ్ నర్సుగా బాధ్యతలు చేపట్టారు. ఆమె మృతితో ఆస్పత్రి వైద్య సిబ్బంది విషాదంలో మునిగిపోయారు.

ఐఎఫ్‌ఎస్‌కు ములగపూడి విద్యార్థి ఎంపిక



లవకుమార్

రౌతులపూడి: మండలంలోని ములగపూడికి చెందిన చింతకాయల లవకుమార్ ఇండియన్ ఫారెస్టు సర్వీసు(ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. సోమవారం విడుదలైన 2024 ఐఎఫ్ఎస్ పరీక్షా ఫలితాల్లో ఆయన 49వ ర్యాంకు సాధించారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వీర సర్వ చక్రవర్తి, వీర వరహాలు దంపతులకు లవకుమార్ జన్మించారు. ఆయనకు సోదరి స్వాతి ఉన్నారు. లవకుమార్ ఒకటి నుంచి మూడో తరగతి వరకూ ములగపూడిలో చదువుకున్నారు. 4 నుంచి 8వ తరగతి వరకూ కత్తిపూడి రిఫరల్ పాఠశాలలోను, 9, 10 తరగతులు తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థలోను, ఇంటర్మీడియెట్ విజయవాడ చైతన్య జూనియర్ కళాశాలలో, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో బీవీఎస్సీ డిగ్రీ చదివారు. కొంత కాలం వెటర్నరీ అంబులెన్స్‌లో సేవలందిస్తూ యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర య్యారు. రెండో ప్రయత్నంలో ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. ఎటువంటి కోచింగ్ లేకుండా, సెల్‌ఫోన్లు వాడకుండా పట్టుదలతో చదివారు. నిరంతర కృషితో ఎట్టకేలకు ఐఎఫ్ఎస్ సాధించాడని తల్లిదండ్రులు తెలిపారు. ఐఎఫ్ఎస్ సాధించిన మొదటి వ్యక్తి తమ కుమారుడు కావడం ఆనందంగా ఉందన్నారు. లవకుమార్ విజయంపై కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా ముత్యాల నాయుడు



అంబాజీపేటలో ముత్యాల నాయుడికి అభినందనలు తెలుపుతున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా, నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధన కేంద్ర నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ముత్యాల నాయుడు కొవ్వూరు, దర్శి, మహానంది తదితర పరిశోధన స్థానాల్లో సుగంధ ద్రవ్య పంటలు, అరటి, నిమ్మ, దుంప పంటలు, పండ్లు, కూరగాయల పంటలపై పరిశోధనలు చేసి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేసి మంచి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు. కొబ్బరిలో తెగుళ్లు, పురుగుల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారికి చేరువలో ఉంటానన్నారు. కొబ్బరిని ఆశించిన తెల్లదోమ నివారణకు ఎప్పటికప్పుడు రైతులతో మమేకమై నివారణకు కృషి చేస్తానన్నారు. ముత్యాల నాయుడిని స్థానిక శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందించారు. ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ హోదాతో పాటు ముఖ్య ప్రజా సంబంధ అధికారిగా బదిలీపై వెళ్లారు.

కోకో కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోకో సాగురైతు సంఘ సహాయ కార్యదర్శి ఆనంద వెంకటప్రసాద్

అంబాజీపేట: ఆరుగాలం శ్రమించి పండించిన కోకో గింజలను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర కోకో సాగురైతు సంఘ సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ అన్నారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో జిల్లా కోకో రైతుల సమావేశం జిల్లా బీకేఎస్ అధ్యక్షుడు చేకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద వెంకటప్రసాద్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ కంపెనీలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కోకో గింజలు నాణ్యత ఉన్నప్పటికీ సరైన ధర లేకపోవడం, విక్రయాలు జరగకపోవడంతో కోకో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. కోకో గింజలకు ప్రస్తుతం అంతర్జాతీయ ధర కిలో రూ.940లు ఉండగా ప్రైవేట్ వ్యక్తులు కిలో రూ.500లోపు కొంటున్నారన్నారు. అంతర్జాతీయ ధరకే కోకో గింజలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విదేశీ గింజల దిగుమతులు నిలుపుదల చెయ్యాలని, ధరలు నిర్ణయించే వరకూ రైతులు, కంపెనీలు కొనుగోలు, అమ్మకాలు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే కోకో రైతులను ఆదుకునేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకో గింజల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కోకో రైతుల సంఘ అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావు, రైతులు దంగేటి గిరిధర్, అడబాల రాజమోహన్, రెడ్డి రామకృష్ణ, అయ్యగారి శ్రీనివాస్, సరెళ్ల అప్పారావు, ప్రకాష్, సమయవంతుల పండు తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: ఎన్నికల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కూటమి పార్టీల అధినేతలు హామీ ఇచ్చి, నేడు అధికారం చేపట్టాక ఆ హామీని విస్మరించారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా శాఖ అధ్యక్షుడు రెడ్డి సతీష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో ఇదే అంశంపై తాను మాట్లాడినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి యనమదల ఉమేష్ కూడా కూటమి ప్రభుత్వ హామీలపై ప్రశ్నించినట్లు చెప్పారు. అమలాపురంలో సతీష్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కూడా కోటి ఉద్యోగాలను కల్పిస్తుందని బీజేపీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీ కూడా అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చమురు సంస్థలు కోనసీమలోని భూముల నుంచి అన్వేషణలు, కార్యకలాపాల పేరుతో ఇతర రాష్ట్రాలకు చమురు సంపదను తరలించుకునే పోతున్నాయే తప్ప ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ఈ నెలాఖరులోగా జిల్లాలో చమురు సంస్థల సమస్యలపై ఏఐవైఎఫ్ ప్రజా సంఘాలు, మేధావులతో ఓ సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాగేశ్వరరావు, రైతులు

అమలాపురం రూరల్: తన పేరుపై ఉన్న భూమిని వేరే వ్యక్తి పేరున ఆన్‌లైన్‌లో మార్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి చెందిన రైతు అమలాపురం కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. సదరు భూమిని తిరిగి తన పేరున మార్చాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పలుసార్లు తిరిగినప్పటికీ పట్టించుకోవడం లేదని, ప్రలోభాలకు గురై వేరొకరి పేరున ఆన్‌లైన్ చేసిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైతు ఆకుల నాగేశ్వరరావు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమికి ఏవిధమైన దస్తావేజులు లేకుండా కుంపట్ల ఆదినారాయణ పేరున ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేశారన్నారు. దీనిపై తనకు తగిన న్యాయం చేయాలని నాగేశ్వరరావు కోరారు.